చదువుల కోవెల.. సుబ్బయ్య బడి

వందేళ్ల చరిత్రకు సాక్ష్యం

వందేళ్లు పూర్తి చేసుకున్న పాఠశాలలు అరుదుగా ఉంటాయి. అలాంటి వాటిలో అల్లూరు పేట సత్రంలోని సుబ్బయ్య పాఠశాల ఒకటి. బ్రిటీష్ కాలంలో ప్రారంభమై దినదినాభివృద్ధి చెందుతూ ఎందరికో విద్యాబుద్ధులు నేర్పింది. ప్రస్తుతం ఫిబ్రవరి 19న పూర్వ విద్యార్థుల కలయికతో శతాబ్ది వేడుకలకు ముస్తాబవుతోంది.



నాడు నేడు కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన భవనం

- బ్రిటీష్ కాలంలో ప్రారంభించిన పాఠశాల
- దినదినాభివృద్ధి చెందిన సుబ్బయ్య బడి
- శతాబ్ది పండగకు ముస్తాబు

అల్లూరు : 1925వ సంవత్సరం ఫిబ్రవరి 20న వేమూరి శేషయ్య తన కుమారుడు వెంకటసుబ్బయ్య పేరుమీదుగా అల్లూరుపేట సత్రంలోని దేవిరెడ్డివారి వీధిలో ఉన్న వారి నివాసంలో పాఠశాలను ప్రారంభించారు. అప్పట్లో మిషనరీస్ స్కూల్స్ ఉండేవి. ఆ సమయంలోనే సొంతంగా హిందూ ఎయిడెడ్ స్కూల్‌గా బ్రిటీష్ ప్రభుత్వం వారిచే గుర్తింపుపొందిన పాఠశాల సుబ్బయ్య బడి. అలా సాగుతున్న తరుణంలో వెంకటసుబ్బయ్య ఫౌండర్‌గా వారి కుమారులు వేమూరి సుబ్రహ్మణ్యం మేనేజర్‌గా, మరో కుమారుడు వేమూరి శేషగిరిరావు ప్రధానోపాధ్యాయుడిగా ఈ పాఠశాల అల్లూరు గ్రామస్తుల ఆదరణ పొందింది. 1979లో ప్రభుత్వంలో విలీనమై పంచాయతీ సమితి పాఠశాలగా నూకలపాటి వీధిలో ప్రారంభించారు. 1983లో యూపీ మండల ప్రజాపరిషత్ స్కూల్‌గా రూపొందింది. తరువాత అల్లూరు వాసి కాటంరెడ్డి విష్ణువర్ధన్ హయాంలో ప్రభుత్వ సహకారంతో మరో మూడు రూములు, ప్రహరీ, టాయిలెట్స్‌ను నిర్మించారు. 2017 నుంచి దాతల సహకారం, స్కూల్ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి చైర్మన్‌గా మేడా రామసుబ్బారెడ్డి, సభ్యుడిగా మేడా శ్రీనివాసులురెడ్డి కన్వీనర్‌గా పి.చెంచయ్య సహకారంతో పాఠశాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారు. ఇప్పుడు ఈ పాఠశాలలో దాదాపు 230 మంది వరకు చదువుకుంటున్నారు.



జెడ్పీ ఉన్నత పాఠశాల(సుబ్బయ్య బడి)



పాఠశాల ప్రాంగణం

నాడు–నేడుతో మరింత అభివృద్ధి

2020కు ముందు వరకు మండల ప్రాథమికోన్నత పాఠశాలగా ఎనిమిదో తరగతి వరకు ఉండగా 2020–2021లో అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి చొరవతో పదో తరగతి వరకు పెంచి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన నాడు–నేడు పథకం ద్వారా రెండో ఫేజ్‌లో రూ.1.80 కోట్లతో 15 రూములు, మరుగుదొడ్లు, కిచెన్, వంటగదితో నూతన నిర్మాణం జరిగింది. ఇంకా కొంతమేర పనులు జరగాల్సి ఉంది.



సుబ్బయ్య రెండో కుమారుడు హెచ్‌ఎంగా పనిచేసిన శేషగిరిరావు (ఫైల్)

ఎందరో ఉన్నత స్థానాలకు..

సుబ్బయ్య పాఠశాలలో చదివి ఇప్పుడు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. సైంటిస్టులుగా, లాయర్లుగా, డాక్టర్లుగా, పోలీసులుగా, ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగారు. ఇలా ఎంతో మందిని ఉన్నత స్థానాలకు చేర్చింది. వీరు శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొని తమ అనుభవాలను వెల్లడించనున్నారు.

పూర్వ విద్యార్థులతో వేడుక

ఇక్కడి బడిలో చదువుకున్న పూర్వ విద్యార్థులతో పాటు, వివిధ రంగాల ప్రముఖులతో శతాబ్ది వేడుకలను బుధవారం నిర్వహించనున్నారు. అంగరంగ వైభవంగా జరిపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ సంఖ్యలో పూర్వ విద్యార్థులు వచ్చి వారి అనుభవాలను వివరిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

అదృష్టంగా భావిస్తున్నాం



తమ తాత సుబ్బయ్య పేరు మీద పాఠశాల ఉండడం, అందులోనే మా నాన్న శేషగిరిరావు హెచ్‌ఎంగా పనిచేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాం. నేను కూడా ఇక్కడే చదువుకుని పూడిపర్తిలో ప్రధానోపాధ్యయుడిగా పనిచేస్తున్నా. ఇక్కడ చదివిన వారు ఎంతో మంది మంచి ఉన్నత శిఖరాల్లో ఉండటం ఆనందంగా ఉంది.

– మేమూరి దివాకర్

గర్వకారణం



వందేళ్ల పాఠశాలలు చాలా అరుదుగా ఉంటాయి. అలాంటి పాఠశాల తమ ఊర్లో ఉండడం ఎంతో గర్వకారణంగా ఉంది. ఈ పాఠశాలలో 1959లో ఐదో తరగతి వరకు చదువుకున్నాం. ఈ పాఠశాలకు మా వంతు సాయం అందించాం. ఇలాంటి పాఠశాల తమ ఊర్లో ఉండటం అదృష్టంగా భావిస్తున్నాం.

– మేడా సుబ్బరామిరెడ్డి

మరింత అభివృద్ధిని కోరుతున్నాం



మా సుబ్బయ్య బడి మరింత అభివృద్ధి చెంది ఎక్కవ మందికి చదువులు అందించాలని కోరుకుంటున్నాం. ఇప్పటికే ఇక్కడ 230 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇంకా ఈ పాఠశాలలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కూడా సహకరిస్తుందని భావిస్తున్నాం.

– పి.చెంచయ్య, ప్రధానోపాధ్యాయుడు

క్లుప్తంగా

ప్రతి ఇంటిని సర్వే చేయాలి

వరికుంటపాడు : మండలంలో వైద్యారోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల హెడ్ కౌంట్ సర్వేను బాధ్యతగా నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు సూచించారు. ఆయన మండలంలోని కనియంపాడు, రామదేవులపాడు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయని రెండేళ్లలోపు చిన్నారులను గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు : పట్టణంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ తరఫున పలు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. స్థానిక రెండో వార్డుకు చెందిన బండి పెంచలమ్మ, చిట్టేటి అంకయ్యలు ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో వారి ఉత్తరక్రియలకు ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యుడు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కూచిపూడిలో చిన్నారుల ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి : పట్టణంలోని గొల్లమూడివారి వీధిలో ఉన్న నలంద ఒలింపియాడ్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న ఎ.పర్నిక ప్రియ, రెండో తరగతి చదువుతున్న ఎ.నివృతి ప్రియలు తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కూచిపూడి నృత్యంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ క్రమంలో వారిని కావలి డీఎస్పీ శ్రీధర్ సోమవారం ఆయన కార్యాలయంలో అభినందించారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రాక్టికల్స్ ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపల్ భానుశ్రీ తెలిపారు.

వెంకటేశ్వరాలయంలో విశేష పూజలు

వరికుంటపాడు : వరికుంటపాడు సమీపంలోని వకుంఠపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ హోమాలు, అర్చనలు, పూజలు చేశారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా

ఉదయగిరి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ముచ్చటగా మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు రెవెన్యూ, ఇరిగేషన్, వెలుగు కార్యాలయాలకు సంబంధించిన అధికారులు మాత్రమే పాల్గొన్నారు. వాస్తవానికి గ్రీవెన్స్‌కు 17 శాఖల నుంచి అధికారులు హాజరు కావల్సి ఉన్నా నామమాత్రంగా అధికారులు రావడంపై వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇదే తంతు కనిపిస్తుండటం గమనార్హం.

సద్వినియోగం చేసుకోండి

సంగం : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ గుర్రప్ప కోరారు. సంగంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు

ఆత్మకూరు : మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, సేవించినా అనర్థాలు తప్పవని, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ అన్నారు. మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై పట్టణంలోని బీఎస్సార్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కాగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు సీఐ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌతమ్ వర్ధంతికి తరలిరండి

సోమశిల : నెల్లూరు డైకస్‌రోడ్డులోని మేకపాటి నివాసంలో ఈనెల 21న జరిగే గౌతమ్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మండలంలోని శంకరనగరం, రేవూరు, కొత్తపల్లి, లింగంగుంట, అనంతసాగరం పంచాయతీలోని పార్టీ నాయకులను సోమవారం కలిసి మాట్లాడారు. ప్రతిఒక్కరూ తప్పక హాజరై గౌతమ్‌రెడ్డికి అంజలి ఘటించాలన్నారు.

సమస్యలపై వినతుల వెల్లువ

కావలి, ఆత్మకూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. వాటిని అధికారులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కావలి : కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న వర్కర్స్ నాయకులు



కావలి ఆర్డీఓకు అర్జీ ఇస్తున్న గిరిజనులు



ఆత్మకూరు ఆర్డీఓకు వినతి పత్రం అందజేత

కావలి : ఆప్కాస్ రద్దుపై వస్తున్న ప్రకటనలపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కావలి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతి ప్రతాన్ని అందజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. యూనియన్ నేతలు ఎం.అంకయ్య, యండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, జి.అంకయ్య, పి.శ్రీనివాసులు, కె.వేణు, ప్రభావతి, నాగరాజు పాల్గొన్నారు.

ఆదుకోండి సారూ..

కావలి : అల్లూరు మండలం ఉడ్‌హౌస్‌పేట గ్రామానికి చెందిన 15 మంది గిరిజన మహిళలు తమ పొలాలను కొందరు స్వాధీనం చేసుకున్నారని, అందులో కొంతైనా తమకు దక్కేలా ఆదుకోవాలని కావలి ఆర్డీఓ వంశీకృష్ణను వేడుకున్నారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లితో కలిసి వినతి పత్రం అందజేశారు. కూలి పనులు చేసుకుని జీవించే తమకు 30 సెంట్లు ఇచ్చినా చాలని తెలిపారు.

తగిన ఆదేశాలివ్వండి

ఆత్మకూరు : మురగళ్ల గ్రామంలోని పెద్ద చెరువులో అన్ని అనుమతులతో చేపల పెంపకం చేపట్టామని, అయితే కొందరు రక్షణ వలలను తొలగించారని, వాటిని తొలగించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆర్డీఓ పావనికి ఆమె కార్యాలయంలో స్థానిక దళితులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మురగళ్లలో చేపల పెంపకం కొరకు చెరువు తూము వద్ద, కాలువల వద్ద రక్షణగా ప్లాస్టిక్ వలలు ఏర్పాటు చేసుకున్నామని, అయితే వాటిని తొలగించారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, స్థానికులు యాకోబు, పెంచల కృష్ణయ్య, పెంచలప్రసాద్, కొండయ్య, కృపారావు, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

పాసు పుస్తకాలు మంజూరు చేయాలి

చేజర్ల : తమ పొలాలకు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని తహసీల్దార్ మురళీకి మూడు అర్జీలు వచ్చాయి. ఈ మేరకు వారు వినతిపత్రాలు సమర్పించారు. తమ సిబ్బంది ద్వారా పొలాలను పరిశీలించి పాసుపుస్తకాలను మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

క్రైమ్ కార్నర్

ఆర్టీసీ బస్సు–బైక్ ఢీ



ప్రమాద ప్రదేశంలో ప్రజలు

వరికుంటపాడు : దట్టమైన పొగమంచు కారణంగా ఆర్టీసీ బస్సు–మోటార్ బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరు స్వల్పంగా గాయపడిన ఘటన సోమవారం ఉదయం మండలంలోని గువ్వాడి గ్రామ సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి డిపోకు చెందిన బస్సు గువ్వాడి మీదుగా పామూరు వెళ్తోంది. గ్రామ సమీపంలోని మలుపు వద్దకు బస్సు రాగా జడదేవి వైపు నుంచి వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కాంచెరువుకు చెందిన ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. ఇతన్ని పామూరు వైద్యశాలకు తరలించారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్సై రఘునాథ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

సోమశిల : బైక్ అదుపుతప్పి ఒకరు గాయపడిన ఘటన అనంతసాగరం మండల పరిధిలోని ఇనగలూరు గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. షేక్.మస్తాన్ బాషా అనే యువకుడు అనంతసాగరం నుంచి స్వగ్రామమైన ఇనగలూరుకు బైక్‌పై వస్తుండగా గ్రామ సమీపంలో మలుపు వద్ద ఒక్కసారిగా రోడ్డుపైకి మహిళలు అడ్డురావడంతో వారిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో మస్తాన్‌బాషా ముఖంపై గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన ప్రసాద్

కలిగిరి : మండలంలోని నాగిరెడ్డిపాళెం సెంటర్‌లో సోమవారం ఓ బైక్‌ను వేగంగా వెళ్తున్న కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. వీర్నకల్లు గ్రామానికి చెందిన లెక్కల ప్రసాద్, మద్దినేని శ్రీనివాసులు కలిగిరి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో గుంటూరు నుంచి వింజమూరు వైపుగా బద్వేలుకు వేగంగా కారు వెళ్తోంది. నాగిరెడ్డిపాళెం సెంటర్ వద్ద వీర్నకల్లు వెళ్లడానికి బైక్‌ను తిప్పడంతో వేగంగా వస్తున్న కారు ఢీకొట్టి దుకాణాల వద్ద ఉన్న రాతిబల్లను ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఉన్న ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కావలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కాటికాపరి మృతి

సోమశిల : సోమశిల గ్రామంలో రోడ్డుపైనే ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కాటికాపరి ఉదయగిరి తిరుపాల్ (45) బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై నడుస్తూ వెళ్తుండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు నేటి నుంచి శిక్షణ

ఉదయగిరి : ఉదయగిరి ఐసీడీఎస్ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు రెండు విడతలుగా జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు సీడీపీఓ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 18, 19, 20వ తేదీల్లో.. రెండో విడతగా 22, 24, 25వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

సీహెచ్‌సీలో ఎమ్మెల్యే తనిఖీ

ఉదయగిరి : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(సీహెచ్‌సీ) ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న వైద్యులు, రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలోని అన్ని వార్డులు తిరిగి వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు : మండలంలోని పడకండ్ల గ్రామ శివారు పొలాల్లో పేకాట స్థావరంపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు చేపట్టి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.10,500 నగదు, నాలుగు మోటారు సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై జిలానీ తెలిపారు. కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డి, కేశవ పాల్గొన్నారు

హైవేపై వాహన తనిఖీలు

సంగం : సంగం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి లైసెన్స్, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధించారు.

- సీతారామపురం : ద్విచక్ర వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై శివకృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎల్వీఆర్ కళాశాల సెంటర్‌లో ఆయన సోమవారం వాహన తనిఖీలు చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుము విధించారు.

రైతులు పూర్తి చేసుకోవాలి

సీతారామపురం : ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను రైతులు సత్వరమే పూర్తి చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి అన్నారు. అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో జరుగుతున్న ఎఫ్‌ఆర్ ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉదయగిరి : స్థానిక డిగ్రీ కాలేజీతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది కె.వెంకటసుబ్బయ్య పలు సూచనలు చేశారు.

జేవీవీ సదస్సు

ఆత్మకూరు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శాస్త్రవేత్త బ్రోనో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ నేతలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జేవీవీ నేతలు సందానిబాషా, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



ఆత్మకూరు సీడీపీఓ కార్యాలయం ఎదుట..



ఉదయగిరిలో సీడీపీఓ సునీతకు వినతిపత్రం అందజేత



వింజమూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద..

కావలి : అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు, ఇతర అలవెన్సులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు మారినా ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలు మారవన్నారు. పాలకులు తీసుకునే జీతాలతో పోలిస్తే, అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చే జీతాలు అతి స్వల్పమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీఓ ఇచ్చి, తాము లేవనెత్తిన సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతి పత్రం సమర్పించారు.

- ఆత్మకూరు : స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సుమారు 250 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి రాధమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేయాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి హజరత్తయ్య, నాయకుడు మహేష్, యూనియన్ సభ్యులు రమణమ్మ, సునీత, హమీద్, సుప్రజ, సెక్టార్ లీడర్లు సుప్రజ, విజయమ్మ, మస్తానమ్మ, పద్మావతి, భారతి, కుసుమ, వేణుమాధవి, జమీల, నగరత్న, విజయలక్ష్మి, పుష్పకళ తదితరులు పాల్గొన్నారు.
- సోమశిల : అంగన్‌వాడీ వర్కర్లు స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి అనంతసాగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వ ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. అనంతరం సీడీపీఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నేత రహంతుల్లా, యూనియన్ సభ్యులు సుబ్బమ్మ, రమాదేవి, నూర్జహాన్, అరుణ, సుజాత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.
- ఉదయగిరి : కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పట్టించుకోకపోవడంపై పలువురు కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉదయగిరి, వింజమూరు ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద వారు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులతో పాటు పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ సునీతకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, యూనియన్ సభ్యులు రజియా, పి.పద్మ, సుభాషిణి, రాధా, వరమ్మ, అరుణ, కె.సుబ్బరామమ్మ, వై.సుజాతమ్మ, షేక్.షకీలా, షేక్.రెహమాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు

సీతారామపురం : ప్రాచీన శైవక్షేత్రమైన సిద్ధేశ్వరానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను పంచాయతీరాజ్ ఏఈ తిరుమలయ్య సోమవారం తొలగించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దైవదర్శనానికి వచ్చే భక్తుల కోసం చెట్లను తొలగిస్తున్నామన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి దేవస్థానం వరకు రూ.2 లక్షల నిధులతో పనులను చేపట్టామన్నారు. ఉపసర్పంచ్ బ్రహ్మయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఉదయగిరి : పట్టణ పరిధిలోని వివిధ వీధుల్లో ఏపుగా పెరిగిన చెట్లు, ముళ్ల పొదల తొలగింపును సర్పంచ్ సామ్రాజ్యం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెత్తా చెదారం, చెట్లు పెరిగి దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పంచాయతీ ఈఓ కరీముల్లా, వార్డు సభ్యులు ఉన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి

ఉదయగిరి : ఉదయగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోలో సిద్ధేశ్వరం, భైరవకోన వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో శివరాత్రి పర్వదినం ఉన్నందున రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించి రాకపోకలకు అనువుగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఉదయగిరి దుర్గంపై ఉన్న కొండను పర్యాటకంగా అభివృద్ధికి చేసేందుకు నిధుల మంజూరుపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ప్రస్తుతం ప్రారంభించిన బస్సు ప్రతి సోమవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి సిద్ధేశ్వరం, భైరవకోనకు వెళ్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కూటమి నేతలు బయ్యన్న, రియాజ్, ఓబుల్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సిద్ధేశ్వరం బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల